# ధ్రువాలు

"అమ్మా" అంటూ తల్లిని కౌగిలించుకుని భోరున ఏడ్చేసింది పంకజం. అసలు విషయమేమీ చెప్పకుండా అలా ఆఫీసు నుంచి రాగానే వెక్కివెక్కి ఏడుస్తున్న కూతురిని చూసి ఆమె తల నిమురుతూ కూర్చుండిపోయింది సుశీలమ్మ.

చిన్ననాటి నుండి కంటికి రెప్పలా కాపాడుకుంటూ వచ్చింది. తను సగమేతిన్నా కూతురికి మాత్రం తండ్రిలేని లోటు కనపడనివ్వకుండా పెంచుతూ వచ్చింది.

తనయితే విధి వంచిత. తన కూతురు మాత్రం తనలా కష్టాలకి గురికాకూడదని, జీవిత సముద్రంలో అనుక్షణం ఎదురయ్యే తిమింగిలాల గురించీ ప్రతిచోట ఎదురయ్యే ప్రమాదాల గురించీ చెబుతూనే వచ్చింది.

పంకజం బడిలో చేరిన దగ్గరనుంచీ తనేమిటో తన చదువేమిటో అంతే! తల దించుకుని వెళ్లి తలిదించుకుని వచ్చేది. చుట్టూ మనుషులకు సాధ్యమైనంత దూరంలో ఉండడమే నేర్చుకుంది పంకజం.

ఆరోజు, అమ్మాయి ఇలా అవడానికి కారణం? ప్రశ్నలన్నీ మనసులోనే ఉగ్గబెట్టుకుని మాట్లాడకుండా ఊరుకుంది సుశీలమ్మ.

కాసేపటికి పంకజం తేరుకుంది.

"కాళ్లూ చేతులూ కడుక్కో! కాఫీ చేసి తెస్తా!" అంటూ సుశీలమ్మ లోపలికి వెళ్లింది.

కాఫీ తాగుతున్న కూతురివంక చూస్తూ కూచుందావిడ.

"అతను అసలు అలా అంటాడనుకోలేదమ్మా!" పంకజం ప్రారంభించింది.

"ఏమన్నాడూ?"

"నేను చీకటివంకే చూస్తూ కూచుంటానట"

"వింటున్నా, చెప్పు"

"నేనెవరి గురించి చెబుతున్నానో తెలుసా?"

"తెలీదు"

"ఆఫీసులో నాతో పనిచేసే గుమస్తా, చిరంజీవిరావు. అతను ఎప్పుడూ నవ్వుతూ నవ్విస్తూ ఉంటాడు... అతనికి అక్కరలేని ఊసులేదు... ఎప్పుడూ చిద్విలాసంగా ఉంటాడు. అందరితోనూ కలగచేసుకుని మాటాడతాడు. మా ఆఫీసరు అతని చిన్ననాటి స్నేహితుడట... ఎవరితోనూ మాట్లాడని ఆయన సయితం ఈ చిరంజీవిరావ్‌తో ఏకాంతంగా సుదీర్ఘంగా కబుర్లు చెబుతూ ఉంటాడు. రెండేళ్లయీ చూస్తున్నా... నా దగ్గరికి వచ్చి వెయ్యి విధాల నన్ను మాటాడించాలని చూశాడు... ఈ రోజు మళ్లీ నా దగ్గరకు వచ్చాడు.

'మీతో చిన్న మాట చెప్పాలని వచ్చాను మరోలా అనుకోకండి. జీవితమన్నది కేవలం పుట్టినందుకు విచారించడానికి కాదు... నేను మీకు ఏమీ కాను. కానీ మీ చుట్టూవున్న మనుషుల్లో నేనూ ఒకడిని మనం ఇలా పదిమందిగా సహజీవనం చాలా కాలం చెయ్యాలి....'

ఇలా ప్రారంభించాడు.

'' అసలు ఆ చిరంజీవిరావ్‌కి నీతో మాటాడాల్సిన అవసరం ఏమిటి ?'' సుశీలమ్మ గొంతులో కించిత్ ఆవేశం - కోపం వినిపించాయి పంకజానికి.

'' నువ్ ఎప్పుడూ ఇంతే ! మాటాడితే కొంపమునిగిందనుకుంటావు. మనం కష్టాలని ఎదుర్కొన్నాం... ఎన్నో బాధలుపడి ఇలా ఈనాటికి ప్రజల్లో పడ్డాం ... కాని బాధల్లో కూడా బ్రతకడం మానేశామా ! అమ్మా! నిన్ను నాన్న అన్యాయం చేసి పోయాడు ... నిజమే ... కాని ఇంక ఈ లోకంలో వెలుగే లేదంటావా ? ''

సుశీలమ్మ మరి మాటాడలేదు.

ఆమె తలలో ఆలోచనలు. నిజంగానే తను నలుగురిలా నవ్వుతూ తిరగలేదు. జరిగినదంతా పీడకలని మరచిపోలేదు - వెలుగుకోసం వెదకడం అవివేకమేనని తనకి అనుభవం నేర్పింది. ఎటు చూసినా మోసం ; దగా ! ఏమరుపాటు ఒక్కక్షణమే చెందినా జీవితాంతం నరకయాతననుభవించవలసి వస్తుంది.

ఏనాడో భర్త తనను వదలి వెళ్లిపోయాడు. తన కడుపున పుట్టిన నలుసు కోసం తను ఇలా బ్రతుకు ఈడ్చుకొస్తోంది. తనకి జరిగిన అన్యాయం జ్ఞానం తెలుస్తున్నప్పటినుంచి కూతురితో చెబుతూనే ఉంది. ఉద్యోగం అయి రెండేళ్లయింది. ఇన్నాళ్లూ లేనిది ఈ రోజు అమ్మాయి తనదే తప్పున్నట్టు మాటాడుతోంది-

మనసులో ముల్లు గుచ్చుకున్నట్టుంది.

ఎవరీ చిరంజీవిరావ్? అమ్మాయితో అతనికేం పని ? అదెలా ఉంటే వాడికేం ? పని కట్టుకుని వచ్చి అమ్మాయితో మాటాడి ఆమె మనసు గాయం చెయ్యవలసిన అవసరమేమిటి ? తనకి అందుబాటులో లేకపోయిందని దుఃఖమా ?

జులాయి వెధవలు అనేకం. ఆడపిల్ల కనపడితే చాలు ఎలాగో ఓలా సాహసించడం ! లొంగదీసుకోడానికి ప్రయత్నం. కాలు జారిందా అధోగతే. వాడిదోవన వాడు పోతాడు.

సుశీలమ్మ కోపంతో పళ్లు పటపట కొరికింది. వీడి సంగతి తేల్చుకోవాల్సిందే.

ధృఢమైన నిశ్చయంతో ఆఫీసుకే వెళ్లింది మరుసటి రోజు.

''మీ కోసం ఎవరో వచ్చారు'' అంటూ చిరంజీవిరావ్‌తో ఎవరో చెప్పారు. వెంటనే లేచాడతను ఆత్రంగా .

'' నమస్కారం ! నా పేరు చిరంజీవిరావ్ మీరు ...''

'' ఇలా రండి ''

సుశీలమ్మ అతన్ని ఆఫీసు బయటికి తీసుకువచ్చింది.

''ఏమిటో విషాదవార్త చెబుతారా !లేక కొడతారా !'' నవ్వుతూ అడిగాడతను. అతని నవ్వులో చిలిపితనం ఆమె కళ్లలోని పదునుని చూసినా ఏ మాత్రం చెదరలేదు.

'' నాపేరు సుశీల !''

'' అలాగా ! నా పేరు ముందే చెప్పాను ఇంతవరకు మిమ్మల్ని గురించి వినడమే కాని చూసే భాగ్యం కలుగలేదు.''

'' మా అమ్మాయి నిన్న ఆఫీసునుంచి వస్తూనే బావురుమని ఏడ్చింది....'' ఆమె ఇంకా

ఏమో చెప్పాలనుకుంది.

'' నిజంగా !'' అతను ఆశ్చర్యంగా అడిగాడు.

'' అబద్ధం ఆడాల్సిన పని నాకు లేదు !''

చిరంజీవిరావు ముఖంలో కొంత గాంభీర్యం చోటుచేసుకుంది.

'' మీరు పంకజంగారి తల్లి ... ఆవిడను నేను ఒక ప్రశ్న అడిగిన మాట నిజం. 'జీవితం అంటే చీకటి కాదు పంకజంగారూ ! అందులో వెలుగుని చూడాలని మీరు ఎందుకు అనుకోరు?'' అని అడిగా. చీకటని కళ్లు కూడా మూసుకుంటామా ? అలా ఉంటే నష్టపోయేది మనమే కాదా ?''

'' ఇదంతా చెప్పడానికి నువ్వెవరు ? మేం ఏడిస్తే నీకేం ? నవ్వితే నీకేం ?... ఆడపిల్లతో ఇలా .... ''

'' క్షమించండి ... ఇందులో ఆడా మగా విచక్షణం అనవసరం. మన చుట్టూ ఉండే మనుషులు కాస్త హాయిగా ఉండడానికి కించిత్ స్నేహం చేయాలన్నదే నా ఆలోచన. నేను తప్పు చేశానని నేననుకోడం లేదు. మీతో చాలా రోజులయి ముఖపరిచయం ఉన్న వ్యక్తి అయి ఉండుంటే మీరయినా అలానే అడుగుతారేమో ! అలా అడగడం ఆమె వ్యక్తిగత జీవితంలో జోక్యం చేసుకోడమని మీరంటే నేనేం చెయ్యలేను. చూడండి సుశీలమ్మగారూ ! మనం ఒక్క పదినిముషాలు అలా చెట్టు క్రింద నుంచుందాం రండి ! ...''

ఇద్దరూ ఆఫీసుకు దూరంగా నడిచారు.

'' నా జీవితం గురించి మీకు తెలియదు... దుఃఖాన్ని ఎదుర్కొనడానికి మార్గం కళ్లు మూసుకుని మూగగా వేదననుభవించడం కాదు ....''

ఇంకా ఏవో చెప్పాలనుకుంటున్నాడతను. సుశీలమ్మకు కోపం ఆగలేదు.

కుర్రవెధవ, వీడా నాకు చెప్పేది ! ... ఛడామడా నాలుగు తిట్టి అవసరమైతే అధికారితో వెళ్లి చెప్పాలని నిశ్చయించుకుంది. ఉప్పెనలా అతనిమీద విరుచుకుపడాలని ఉన్నా ఒక్క క్షణం నిలదొక్కుకుంది.

''నిన్న మీ అమ్మాయితో మొదటిసారి నేను మాటాడాను. రెండేళ్లయి ఇక్కడే ఒకే ఆఫీసులో పనిచేస్తున్నాం ... ఎవరితోనూ ఆ అమ్మాయి మాటాడడం నే చూడలేదు. ఎవరయినా పలకరించినా ముక్తసరిగా సమాధానం చెప్పి ఆమె తన పనిలోకి వెళ్లిపోతుంది... ఎప్పుడూ దిగులుతో ఏదో పోగొట్టుకున్న మనిషిలా ఉంటుంది ... మా వాళ్లంతా కార్తీకమాసం కదా ఉసిరిక చెట్టు క్రింద వనభోజనం చేద్దామని ఒక ప్రతిపాదన చేశారు.... అందరూ ఆమెతో ఈ మాట చెప్పడానికి వెనకాడారు... నేను వెళ్లాను ఆమెతో మాటాడడానికి పిక్నిక్ సంగతి దేముడెరుగు. ఆమె కళ్లలో నీళ్లు తిప్పుకుంది. నాకు తోచిన మాటలేవో ఆమెతో చెప్పాను. ఆమె మనసుకి కష్టం కలిగించే ఉద్దేశంతో మాత్రం కాదు ... అందరం కలసి వెళ్లాలని కొంతసేపు కులాసాగా గడపాలని మావాళ్ల ఆశ. ఇందులో తప్పుంటే మన్నించండి.'' అతను ఆగి ఆమెవంక చూశాడు.

'' అమ్మాయిని పిక్నిక్కి తీసుకెళదామని నీ ఆరాటం, అంతేనా ?''

'' నాతో కాదు ... మాతో తీసుకెళ్లాలని...''

'' నీకు పెళ్లయిందా ? ''

'' నాకా ? ... పెళ్లా ? ... భలేవాళ్లే .... నాకు పిల్లనెవరిస్తారు ? అధవా ఇచ్చినా నా బాధ్యతల మధ్య భార్యను నేనెట్లా పోషించగలను ? ఇద్దరు తమ్ముళ్లు – ఒక చెల్లాయి. అమ్మకు అనారోగ్యం... నాకొచ్చే జీతం అయిదువందలు ... పెళ్లి చేసుకోవాలని నేనెప్పుడూ అనుకోలేదు కాని ఉన్నంతలో నవ్వుతూ బ్రతుకుదామని మాత్రం నిత్యం ప్రయత్నం చేస్తూనే ఉన్నాను. పెళ్లి గురించి మాత్రం నాకు అలోచన రాలేదు.'' అతని గొంతులో కొంత వేదన ఉంది. కాని అది సుశీలమ్మ చెవికందలేదు.

'' పెళ్లి ఆలోచన రాకుండానే మా అమ్మాయిని పిక్నిక్‌కి తీసుకెళ్లాలని ప్రయత్నించావన్నమాట... నీకు చెల్లి ఉందన్నావ్ కదూ ... నీ చెల్లిలినే ఇలా ఎవ్వరైనా అడిగి ఉంటే అడిగినవాళ్లను ఏమనేవాడివి ?''

'' ఒకటి మాత్రం నిబ్బరంగా చెబుతున్నా ! కోపం మాత్రం తెచ్చుకునే వాడినికాను ... ఒక్కమాట, మీరు కోపం తెచ్చుకోకండి. పదిమంది మధ్య బ్రతుకుతున్నాం.... నలుగురూ సంతోషంగా ఉండాలనుకోడం నేరమా ?.... మా నాన్నగారు పోయేక మేం ఎన్ని కష్టాలు పడ్డామో దేముడికే తెలియాలి. వారాలు చేసుకుని నేను బియ్యే పూర్తిచేశాను... ఏదో ఉద్యోగం దొరికింది. మనుషులు కష్టాలలో ఉన్నప్పుడే నిబ్బరాన్ని అలవరచుకోవాలి. మరొక్కమాట. ఆమెను గురించి కొందరు మిత్రులు తేలికగా మాటాడారు. ఆమె వెలుగుచూడని మనిషని అన్నారు. నాతో పందెం వేశారు ఆమెను పిక్నిక్‌కు ఎంత బ్రతిమాలి అయినా తీసుకుని రాలేనని.... ఆమెకు నచ్చచెప్పడానికి ప్రయత్నం చేశాను ... పందెం గెలవడం మాత్రమే నా ఉద్దేశంకాదు .... ఆమె చేత ఒక చిరునవ్వు నవ్వించి చుట్టూ చిక్కపడుతున్న చీకటిని చీల్చడానికి ప్రయత్నం ప్రారంభించమని చెప్పాను. సుశీలమ్మగారూ, నేను మీకు ఏమీ కాను. కానీ మీ తోటి మనిషిని, కష్టం వచ్చిందని దాన్ని తలచుకుంటూ కుమిలిపోడం కంటే జీవితాన్ని ఆనందమయం చేసుకోడానికి మనకి నవ్వు కావాలి. నవ్వగలిగాలి... ఇతరులకు కొంత వెలుగు నివ్వగలగాలి... మీరయినా మీ అమ్మాయికి చెప్పండి. శతకకారుడు చెప్పిన బంతిని గుర్తు తెచ్చుకోండి.... మంచివాళ్లు గ్రహపాటువల్ల కిందపడ్డా బంతిలా మీదకి లేవగలరు. మీరు కాదు కూడదనుకుంటే ఆవిడ లేకుండానే పిక్నిక్ జరుగుతుంది. ఆగిపోదు. కానీ ఆత్మీయతను సంపాదించడానికి సహజీవనం అవసరం .... ఆ అమ్మాయితో మాటాడ్డానికి మరొక కారణం ఉంది. నా ప్రాణ మిత్రుడు ఆమెను పెళ్లి చేసుకోవలనీ అనుకుంటున్నాడు ....'' అతను ఇంకా ఏదో చెప్పబోయాడు.

'' పెళ్లి చేసుకుని నేనిలా అనుభవిస్తున్నాను. ఇంకా అది అనుభవించాలా ? చాలు బాబూ! ఆ ప్రస్తావన వద్దు ! '' సుశీలమ్మ కోపం మటుమాయమైపోయింది. ఆమె ముఖం విషాదంతో నిండిపోయింది.

'' మీరు పెద్దవాళ్లు, కాని చీకటి మధ్య మసలుతూ వెలుగుని చూడ నిరాకరిస్తోంది అమ్మాయి జీవితంలో ఆనందం – ఓర్పులో, అవగాహనలో ఒక తృప్తి ఉందని ఆవిడ తెలుసుకోలేకుండా చేసింది మీ పెంపకం .... మీ మీద అభిమానంతో ఇంత చనువు తీసుకుని మాటాడుతున్నా... మనలో అంతా చెడ్డవాళ్ళే ఉంటే ఈ మాత్రంగా ఇలా బ్రతకగలిగే వాళ్లమేనా ? చీకటి వెనకనే

పొంచి ఉండి పొద్దు పొడవదూ ?''

సుశీలమ్మ ఆలోచనలో ఉండిపోయింది. అధికారి వద్దకు వెళ్లి చిరంజీవిరావ్ మీద ఫిర్యాదు చేసి ముఖం వాచేటట్టు చీవాట్లు పెట్టించాలనుకుంది. కాని అతని మాటలు వింటూ ఉంటే తను ఏనాడు దరికి రానియ్యని ఆలోచనలు ఉప్పెనలా ఆమెను ముంచెత్తసాగాయి.

'' మీరు ఎందుకు వచ్చారో నాకు తెలుసు. నా మీద అధికారికి చెబుదామని, చర్య తీసుకునేటట్టు చెయ్యాలని, చెడు మీద తీసుకోబడని చర్యను వా మీద తీసుకుంటానంటే నే చెయ్యగలిగిందేమీలేదు. మీ అమ్మాయిని పెళ్లి చేసుకుందామన్న ఆలోచన ఉన్న మనిషి మరెవరో కాదు - ఆ అధికారే - మిమ్మల్ని చాలా రోజుల నుంచి తెలుసునని చెప్పాడు ... ఇక ఆగితే బాగుండదు ... నే వెళుతున్నా !''

అకతాయి కుర్రాడనుకున్న చిరంజీవిరావ్ గబగబా అడుగులువేసుకుంటూ వెళుతూ ఉంటే అలా చూస్తూ ఉండిపోయిన సుశీలమ్మ కాసేపటికి తేరుకుని మెల్లగా ఇంటి ముఖం పట్టింది.

చీకటి మాటునున్న ఇంత వెలుగు ఒకేసారి జిగేల్ మనడంతో ఆమె తట్టుకోలేకపోయింది. చుట్టూ ఏవో కాంతులు ... రంగులు .....

ఆమె వడివడిగా అడుగులు ముందుకు వేస్తూ పోయింది....

**కృష్ణా పత్రిక**

16-3-1984